# అంకుల్ ఫ్రెడ్డీ

గబ్బిట కృష్ణమోహన్

మూలం పి.జి.వుడ్‌హౌస్

ఎమెస్కో

# అంకుల్ డైనమైట్

ఉప్పులూరు, ఇందుపల్లి, గుడ్లవల్లేరు లాంటి పల్లెటూళ్ళని కలుపుతూ బందరు వెళ్ళే మీటర్ గేజి ప్యాసింజర్ ఆరోజు మధ్యాన్నం దట్టంగా పొగ విడుస్తూ బద్ధకంగా బెజవాడ స్టేషను వదిలి నత్తనడక సాగించింది. ఆ రైల్లో రోజూ క్రమం తప్పకుండా ప్రయాణం చేసేవాళ్ళు – బందరు చుట్టుపక్కలున్న గ్రామాల్నించి పాలబిందెల్తోనూ, పెరుగు కుండల్తోనూ తెల్లవారుఝామునే పాలబండిలో బయల్దేరి బెజవాడకి యివతలున్న సత్యనారాయణపురం స్టేషన్ బయట అమ్ముకునేవారు కొందరు; మరికొందరు బిందెల్నిండా తెచ్చిన పాలని హోటళ్ళకి సరఫరా చేస్తూ వూరి అవసరాలని తీర్చి పుణ్యం కట్టుకుంటారు. వర్తకం ముగించుకుని తిరిగెళ్ళేందుకు ఈ మధ్యాహ్నం రైలు మంచి సదుపాయం. దీంట్లో ప్రయాణం చేసేవాళ్ళందరూ విధిగా టిక్కెట్టు కొనే ఎక్కుతారని రైల్వేవాళ్ళు కూడా నమ్మరు.

ఆ రైల్లో ఇంటర్ క్లాస్ సదుపాయం వుంది. డబ్బూ, దర్పం వున్నవాళ్ళు దాంట్లోనే ప్రయాణం చేస్తారు. ఇవాళ ఆ డబ్బాలో యిద్దరు ప్రయాణీకులుండటం విశేషం. వాళ్ళలో ఒక తను యువకుడు. నిండు విగ్రహం. భారీగా కండలు తిరిగున్న శరీరం. మొహం మాత్రం కమిలి పోయి నల్లగా బొగ్గు పులిమినట్టుంది. రెండో ప్రయాణీకుడు ఆ యువకుడి కన్నా వయసులో యించుమించు ముప్ఫయి ఏళ్ళు పెద్ద. వయసులో పెద్దవాడే అయినా సన్నగా, పొడుగ్గా వుండి, వెండి తీగెల్లా తెల్లగా మెరిసే మీసంతో దర్జాగా వున్నాడు. దానికితోడు మిలమిల మెరిసే కళ్ల మూలాన చలాకీతనం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. గతించిన కాలంలో ప్రతి నిమిషాన్నీ ఎంతో ఖుషీగా, వుల్లాసంగా గడిపినట్టూ; ముందురోజులు కూడా అదేవిధంగా గడపాలన్న పట్టుదల వున్నట్టు ముఖంలో స్పష్టంగా వెల్లడవుతుంది. టోపీ షోగ్గా నెత్తిమీద పక్కకి వొరిగించి పెట్టుకుని పైపు ముట్టించి తాపీగా పీల్చడం మొదలెట్టాడాయన. రైలు బయల్దేరి పది నిమిషాలైంది. ఇంతసేపూ నిశ్శబ్దమే వుంది వాళ్ళిద్దరి మధ్య. అప్పటిదాకా తోటి ప్రయాణీకుడిని కళ్ళ కొస లనించే గమనిస్తూ కూచున్న యువకుడు, హుహూ అంటూ గొంతు సవరించుకున్నాడు. ఆ ... ఆ ... అని గొణిగినట్టు చేశాడు. దానికా వయసు మళ్ళిన వ్యక్తి ఏమిటన్నట్టు తల పైకెత్తి చూశాడు. దాంతో అతను మరీ నల్లబడి నోరెందుకు విప్పానా అనవసరంగా అనుకుంటూ, 'క్షమించాలి, తమరు జమీందారు సోమేశ్వర్రావుగారు కదూ?' అని అడిగాడు.

‘ఔను బాబూ, నేనే ఆయన్ని.’

‘సంతోషం.’

పెద్దాయన ఆశ్చర్యపడ్డాడు.

‘ఆ సంగతంటే నాకే విపరీతమైన సంతోషం, మరి నువ్వెందుకు వుప్పొంగి పోతున్నావ్?’

‘ఏంలేదండీ, మీరా కాదా అని సందేహం వచ్చింది.’ అలా అని, రైల్లో తారసపడ్డ ప్రతివాడినీ పలకరిస్తూ పోతుంటే ఏం తంటానో అనుకుని కొంచెం తటపటాయించాడతను. ‘అసలండీ, మిమ్మల్ని నేను బాగా ఎరుగుదును. అవతారం, నేనూ చిన్నప్పుడు మీ యింట్లో ఆడుకుంటుండే వాళ్ళం. ఆవిధంగా మీ యింటికి తరచు వస్తూ పోతూ వుండేవాణ్ణి. మీకు గుర్తుందో లేదో, ఓసారి మీరు ముద్దొస్తున్నావురా అంటూ పావలాకాసిచ్చి తాయిలం కొనుక్కోమన్నారు.’

‘అవునా, తిని కూచుంటే కొండలైనా తరిగిపోతాయని వూర్కే అంటారా?’

‘మీరు నన్ను గుర్తుపట్టినట్టు లేదు. నా పేరు వరప్రసాద్. పూర్తిపేరు యాకమూరి కాళీవరప్రసాద్.’

‘హోర్నీ, బలేవాడివయ్యా. అవును నువ్వే కదూ, గుర్తుపట్టకపోవడం ఏమిటయ్యా? ‘‘అవునూ, మనవాడున్నాడే, అదే మన యాకమూరి కాళీవరప్రసాదు ఏమైపోయాడు చెప్మా’’ అని నీగురించి మా ఆవిడని అడగని రోజు లేదంటే నమ్ము,’ అన్నాడు రావుబహదూర్ సోమేశ్వ ర్రావు హృదయపూర్వకంగా అబద్ధాలాడేస్తూ.

‘అలాగా, సంతోషం. జమీందారిణిగారు కులాసాగా వున్నారా?’

‘ఓ, ఆవిడకేం బ్రహ్మాండంగా వుంది.’

‘సంతోషం. చిన్నప్పుడోసారి నాకు అణా బిళ్ళ యిచ్చారావిడ.’

‘అవునయ్యా, ఆడవాళ్ళకి మగవాళ్ళకన్నా చెయ్యి విసులుబాటుతనం తక్కువని గుర్తు పెట్టుకో. వాళ్ళ మెదడుచుట్టూ వుండే బొమికల నిర్మాణక్రమమే దానికి కారణం కావచ్చు. బావుందయ్యా, నా శ్రీమతిగారు నిక్షేపంలా వుంది. నిన్ననే ఆవిడగార్ని చెన్నపట్నంలో స్టీమ రెక్కించి వొస్తున్నాను. రంగూనుకి పంపానావిణ్ణి.’

‘రంగూనుకా?’

‘అపార్థం చేసుకోకు, ఆవిడ కోరిక మీదే పంపించాలేవయ్యా.’

ఆ కమిలిపోయిన పండుకి విషయం అర్థం చేసుకోటానికి కొంత వ్యవధి పట్టింది. అలవాటుగా సంతోషం అనబోయి తమాయించుకుని, అవతారం ఎలా వున్నాడని అడిగాడు.

‘ఓ, శేషావతారం ఉజ్జ్వలంగా వెలుగుతున్నాడు. గెలిచిన వీరుడిలా దేశమంతా బలాదూరు తిరుగుతున్నాడు. ఈమధ్యనే మలయాలో స్థిరపడ్డ వేలువిడిచిన మేనమామొకడు చనిపోతూ

తన ఆస్తంతా వీడికే చెందుతుందని రాసి పోయాడు. దాంతో మా అవతారం ఇప్పుడు తల మహా పైకెత్తుకు తిరుగుతున్నాడంటే నమ్ము. పైగా పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించుకున్నాడు కూడా.'

'మంచిది.'

అప్పటిదాకా కేవలం సంతోషం అంటూ సరిపుచ్చి యిప్పుడు మంచిది అని దానికి తోడుగా అనటంతో విస్తరిస్తున్న వరప్రసాదు పదజాలానికి రావుబహదూర్ సోమేశ్వర్రావు ముచ్చట పడ్డాడు.

'మా అవతారం యిప్పుడు చాలా ఆనందంగానే వున్నా, నాకు మాత్రం కొంచెం సందేహంగా వుందయ్యా. చూడు వరప్రసాదూ, అందరికీ అనుకున్నవన్నీ నూటికి నూరుపాళ్ళూ జరగవన్న సత్యం నీకు తెలుసో లేదో. మాటవరసకి చూడు – ఎల్లయ్య అనేవాడు ఆనందంతో వుబ్బితబ్బిబ్బవుతుంటే, పుల్లయ్య అనేవాడు మొహం మాడ్చుకుని విచారంతో కుంగిపోతూ వుండొచ్చు. అవిధంగానే రామయ్యో, సుబ్బయ్యో, ఆమాటకొస్తే వల్లకాట్లో రామనాథమో. ఎందుకు చెబున్నానంటే మావాడున్నాడే, అవతారం, వాడి ప్రణయఘట్టమే చూడు. అసలతను యిప్పుడు నిశ్చయించుకున్న అమ్మాయిని కాకుండా, నాకు బాగా పరిచయమున్న మరో పిల్లని చేసుకుంటే ఎంతో బాగుండని మొదటినించీ నా అభిప్రాయం. పైగా ఆ పిల్ల నాకు చాలా దగ్గిర కూడాను. చిన్నప్పట్నించీ అల్లారుముద్దుగా పెరిగింది. యవ్వనంలోకి ప్రవేశించి యిప్పుడా పిల్ల మంచి నిదానంతో, తనదైన వ్యక్తిత్వం ఆపాదించుకుని ఠీవితో వుట్టిపడుతోంది. పైగా ఆడపిల్లలకి వుండాల్సిన లక్షణాలన్నీ రంగరించుకుని వుందని నా అభిప్రాయం. ఇకపోతే, ఆ పిల్లకున్న లోకజ్ఞానం వుంది చూశావూ అది – యిద్దరికి సరిపడేంత వుందనుకో. అసలీ ఒక్కసంగతే చాలు మావాడు, ఘనత వహించిన కనకవల్లి శేషావతారానికి, కాబోయే భార్యలో వుండాల్సిన సుగుణం. కానీ, ఎందుకనో ఆశించినట్టు జరగడం లేదు. అయినా ప్రస్తుతానికి దీన్ని యిక్కడ్తో వదిలేద్దాం. చివరికి అంతా మంచిగానే జరుగుతుందని ఆశిద్దాం, అంతేకదూ?'

'ఔనండీ, అంతేకదా మరి.'

'సంతోషం. ఇప్పుడీ సరికొత్త అమ్మాయిని నేనింకా కలవలేదు కాని, బాగానే వున్నట్టనిపిస్తోంది నాకు. అసలు ముఖ్యంగా కావాల్సింది – మావాడు ఓ యింటివాడు కావడం. అది కూడా ఎంత తొందర్లో అయితే అంత మంచిది. లేకపోతే, రేప్పొద్దున ఓ బర్మాముడిని వెంటేసుకొచ్చి – ఇదిగో ఈవిడే నా భార్య, ఈమధ్యనే బర్మాలోనో, మలయాలోనో పరిచయమైందని చెప్పగల సమర్థుడే వీడు. అందమైన ఆడపిల్లని చూడగానే మైనంలా కరిగిపోతాడు. బహుశా ఆ సంగతి నీక్కూడా తెలిసే వుండొచ్చు.'

'లేదండీ, చిన్నప్పుడెప్పుడో కలవటమే కానీ తరవాత మళ్ళీ కలవలేదు మేమిద్దరం.'